ప్రజాశక్తి

సోమవారం 5 డిసెంబర్ 2022

5

పార్వతీపురం మన్యం

క్రీడాకారులకు అభినందన

పార్వతీపురం టౌన్ : కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాకారులు విజయం సాధించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆకాంక్షించారు. అనిల్‌కుమార్ శర్మ శిక్షణలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, రాంబాబు జోషి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ధాన్యం కొనేవారేరీ?

- కళ్లాల్లో రైతుల జాగరం
- నేటికీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాని కొనుగోలు ప్రక్రియ
- అందుబాటులో లేని గోనె సంచులు, హమాలీలు
- వాతావరణ మార్పులతో హడలిపోతున్న అన్నదాత

కళ్లాల్లో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ నామమాత్రంగానే సాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం ధాన్యాన్ని కళ్లాల వద్దనే కొనుగోలు చేస్తామని, ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి హమాలీల ద్వారా వాహనాల్లో లోడింగ్ చేసి మిల్లుకి చేర్చే వరకు పూర్తి బాధ్యతలు ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. అయితే నేటి వరకూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ అక్కడక్కడ అరకొర కేంద్రాల ద్వారా తప్ప పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటికే వరికోతలు ప్రారంభమై పంట నూర్చి, ధాన్యాన్ని కుప్పలుగా వేసి, అమ్మకానికి రైతులు సిద్ధం చేశారు. తీరా కొనేవారు లేక రైతులు కళ్లాల వద్దనే రాత్రీ పగలు కాపలా కాస్తూ జాగారం చేయాల్సి వస్తుంది. ధాన్యం కొనుగోలు అధికారికంగా ప్రారంభమైనప్పటికీ అరకొర మిల్లులు తప్ప పూర్తిస్థాయిలో ఎక్కడా తెరవలేదు. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న మిల్లులు నేటికీ తెరవకపోవడం గమనార్హం. చాలామంది రైతులు తమ పంటను కుప్పలుగా వేసుకొని ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టే సమయానికి నూర్పిడి చేయవచ్చని ఆలోచనలో ఉన్నారు. రైతుల తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర ఎలాగో లేదు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కూడా కొనే నాథుడే కరువయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులపై అదనపు భారం

కళ్లాల వద్దే ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పిన అధికారుల ప్రకటనకు సంతోషించిన రైతన్నకు నేడు నిరాశ మిగిలింది. రైతులకు హమాలీలను అందుబాటులో ఉంచి వారితోనే ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి వాహనాలకు లోడింగ్ చేస్తామని చెప్పి, రవాణా, సంచులు ఏర్పాటు చేస్తామని ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం రైతులే గోనె సంచులు ఏర్పాటు చేసుకోవాలని, అందుకయ్యే ఖర్చులకు గాను 40 కేజీలు సామర్థ్యం గల గోనె సంచికి రూ.3.90 చెల్లిస్తామని చెబుతున్నారు. అయితే మార్కెట్లో గోనెసంచె ధర 10 నుండి 12 రూపాయలకు పలుకుతుంది. దీనికోసం రైతులు అదనంగా 6 నుంచి 8 రూపాయలు భరించాల్సి వస్తుంది. జిల్లా కేంద్రంలోని ఆర్‌బికెల్లోనే గోనె సంచులు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ధాన్యం రవాణా తామే చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు రైతులు వాహనాలను ఏర్పాటు చేసుకుంటే రవాణా ఛార్జీలను రైతులు ఖాతాలోకి జమ చేస్తుందని చెబుతోంది. అయితే చిన్న, సన్నకారు రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు చేర్చడానికిగాను తమకు గిట్టుబాటు కాదని, వాహనదారులు ముందుకు రావడం లేదని వాపోతున్నారు. కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురు రైతుల ధాన్యాన్ని ఒకే వాహనంలో సర్దుబాటు చేసి రవాణాకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, ధాన్యం దొంగలు, ప్రకృతి వైపరీత్యాల బారినపడి నష్టపోకుండా రైతులు కళ్లాల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి దాపురించింది.

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం ప్రతి గింజను రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తామని, వారికి ఎటువంటి ఇబ్బందులూ కల్పించబోమని అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు 15 రోజులుగా చెప్పకొస్తూనే ఉన్నారు. ముందుగా ధాన్యం సేకరణకు సరిపడా గోనె సంచెలు ఆర్‌బికె కేంద్రాల వద్ద ఉన్నాయని, రైతులు తీసుకెళ్లొచ్చని అధికారులు చెప్పకొచ్చారు. ఇటీవల ఆ మాటలు మారిపోయాయి. బస్తాలు మీరే తెచ్చుకోండి... ధాన్యం మీరే మిల్లుకు తీసుకుపొండి... ఆ ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని ఇప్పడు మాటమార్చారు. దీంతో రైతులు గందరగోళంలో పడ్డారు. నిన్నటి వరకూ అన్నీ తాము చేస్తామని చెప్పి తీరా ఇప్పడు మీరే తెచ్చుకోండి... మీరే పంపుకోండి అంటూ అధికారులు చెప్పడంతో ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మద్దతు ధరకు గండిపడే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో ఎప్పుడు జరుగుతుందోనని రైతులు బిక్కుబిక్కుంటూ కాలయం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరిపడా గోనెసంచులు, రవాణా సౌకర్యం, మిల్లులను అందుబాటులోకి తీసుకొచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కళ్లంలో పోసిన ధాన్యం

5కె వాక్‌లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉద్యోగులను, ఉపాధ్యాయులను

మోసగించిన ప్రభుత్వం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- కలెక్టరేట్

ఉద్యోగులను, ఉపాధ్యాయులను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం పార్వతీపురంలో ఉపాధ్యాయుల 5కె వాక్, బొబ్బిలిలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పార్వతీపురంలోని బెలగాం చర్చి సెంటర్ వద్ద ప్రారంభమైన వాక్ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2019కు ముందు పాద యాత్రలో సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్‌ను తీసుకు వస్తానని జగన్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నెరవేర్చ లేదు కదా, తెలియక హామీ ఇచ్చానని చెబుతున్నారని, ఇది ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. 3 లక్షల మంది ఉపాధ్యాయుల, ఉద్యోగుల పెన్షన్ భద్రతకు సంబంధించిన అంశంపై మాట ఇచ్చి మడమ తిప్పారని అన్నారు. సిపిఎస్ రద్దు అంశం రాజకీయ ఎజెండాగా మారబోతుందని, రద్దు చేయక పోతే రాజకీయ నష్టం తప్పదని హెచ్చరించారు. అనేక రాష్ట్రాలలో సిపిఎస్‌ను రద్దు చేస్తుంటే ఇబ్బంది లేనిది మన రాష్ట్రానికి ఎందుకు ఇబ్బంది వస్తుందని ప్రశ్నించారు. భవిష్యత్‌లో సిపిఎస్ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. 5కె వాక్ చర్చి జంక్షన్ నుండి బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, మెయిన్ రోడ్డు మీదుగా జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహనరావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా సహాధ్యక్షులు బి. విజయకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజామణి, సిపిఎస్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎం. శంకర్‌రావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, కృపానందం తదితరులు పాల్గన్నారు.

సిపిఎస్ రద్దు చేసేవరకు పోరాటం

బొబ్బిలి : సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేసే వరకు పోరాటం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఎన్‌జిఒ హోం సమీపంలో సంతకాల సేకరణ చేపట్టారు. సంతకాల సేకరణను ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి కన్వీనర్ సిహెచ్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని జగన్ ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జెఎసి జిల్లా నాయకులు మురళి, ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు డివి రమణ, పెన్షనర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, అనంతరావు, రమేష్, శ్రీనివాస్, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-పాచిపెంట

కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సిఐటియు పాచిపెంట మండల మహాసభను ఆదివారం స్థానిక ఎడ్లవీధి పాఠశాలలో నాయకులు టి.ప్రభావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులపై దాడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు కేంద్రం లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తోందని, మరోవైపు కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దుచేసి, లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కుల అమలు కోసం మళ్లీ పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గం ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13, 14న పార్వతీపురం పట్టణంలో సిఐటియు జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, 13న జరిగే ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఆశ, అంగన్వాడీ, ఎండిఎం, వైకెపి తదితర స్కీమ్‌వర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఎనిమిది మందితో సిఐటియు మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.ప్రభావతి, సభ్యులుగా జి.కళ్యాణి, సిహెచ్ భవాని, గుణుతూరు రామారావు, చింతల పోలిరాజు, ఎన్.నాగవేణి, వై.మంగమ్మ, కోరాడ ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గిరిజన విద్యాభివృద్ధికి కృషి

- పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక
- పిల్లల బంగారు భవితకు మార్గనిర్దేశం
- 'ప్రజాశక్తి'తో ఐటిడిఎ డిడి బి.సూర్యనారాయణ ముఖాముఖి

'గిరిజన విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాం. విద్యార్థులతో కాపీ రైటింగ్, అసైన్మెంట్లు, పరీక్షలు నిర్వహించేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశాం. గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి హాజరు వివరాలు, ఆరోగ్య, కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకుని వాటికి తగ్గట్లు సూచనలు చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ సంప్రదిస్తూ విద్యార్థుల భవితకు బాధ్యత వహించేలా ఉపాధ్యాయులను అనునిత్యం ప్రోత్సహిస్తున్నా'మని పార్వతీపురం ఐటిడిఎ డిడి బి.సూర్యనారాయణ వెల్లడించారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, కలెక్టరేట్



పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?.

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో మొత్తం 47 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 32 ఆశ్రమ పాఠశాలలు బాలురకు గాను, 15 ఆశ్రమ పాఠశాలలు బాలికలకు గాను కేటాయించబడ్డాయి. బాలురకు మూడు గురుకుల పాఠశాలలు, బాలికలకు ఒకటి గురుకుల పాఠశాల ఉన్నాయి. గురుకుల కళాశాలలు నాలుగు ఉండగా, ఇందులో రెండు బాలికలకు, మరో రెండు బాలురకు కేటాయించారు. నాలుగు ఏకలవ్య పాఠశాలలున్నాయి. మొత్తం విద్యాలయాల్లో 25015 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 14,013 మంది బాలురు, 11,002 మంది బాలికలు ఉన్నారు.

విద్యాదీవెన, అమ్మ ఒడి పథకాలు ద్వారా ఎంతమంది విద్యార్థులు లబ్ధి పొందారు?.

ప్రభుత్వం అందజేస్తున్న విద్యాదీవెన పథకం ద్వారా 3843 మంది విద్యార్థులకు గాను 5.62 కోట్ల రూపాయలను వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. అమ్మఒడి పథకం కింద 15,814 మంది విద్యార్థులకు సుమారు 23 కోట్ల రూపాయలు అందజేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలేమిటి?.

మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఇప్పటికే మొదటి దశలో మౌలిక సదుపాయాల రూపకల్పన అభివృద్ధి కార్యక్రమాలు కొన్ని పాఠశాలల్లో పూర్తయ్యాయి. మిగిలిన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే 33 స్కూళ్లకు చెందిన హాస్టళ్లకు గాను తలుపులు, విద్యుత్తు, మరుగుదొడ్లు, తదితర తొమ్మిది రకాల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతం వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు అందజేస్తున్న మెనూ ఛార్జీలను ప్రభుత్వం పెంచాలనే ఆలోచనలో ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మెనూ ఛార్జీలను మార్పు చేస్తాం.

పదో తరగతి విద్యార్థులపై ఏ విధమైన శ్రద్ధ తీసుకుంటున్నారు?.

ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల్లో 1672 మంది విద్యార్థులు, గురుకుల పాఠశాలల్లో 500 మంది విద్యార్థులు.. మొత్తం 2172 మంది పదో తరగతి చదువుతున్నారు. వీరి ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడం కోసం డిసెంబర్ నెలాఖరికి సిలబస్ మొత్తం పూర్తి చేసే విధంగా, ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. జనవరి ఒకటో తేదీ నుంచి పదో తరగతి పరీక్షల సన్నద్ధం కోసం కొత్త షెడ్యూల్ రూపొందిస్తాం.



బిసి గర్జన పోస్టరును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వెనుకబడిన తరగతులే వెన్నెముక

ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి-పాలకొండ

బిసిలంటే కేవలం వెనుకబడిన తరగతులు కాదని, వారే సమాజానికి వెన్నెముకని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ స్వగృహం వద్ద నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మరింత బలోపేతం చేసే దిశగా సిఎం జగన్ కృషి చేశారని తెలిపారు. స్పీకర్‌తో సహా మంత్రివర్గంలో 11మందికి చోటు కల్పించి బిసిలను ఆయన బలమైన శక్తులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ నెల 7న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే జయహో బిసి మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

పార్వతీపురం టౌన్ : ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొంత కాలంగా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని అసహనం వ్యక్తంచేశారు. దీంతో ఉపాధ్యాయులు రుణాల ఇఎంఐలకు వడ్డీలు చెల్లించుకోవాల్సి వస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అక్కడ నోటరీ

ఇక్కడెలా ఆమోదిస్తారు?

- నిద్రావస్థలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి-సాలూరు

పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ నోటరీ సంతకాలతో పట్టణంలో గత కొంతకాలంగా ధ్రువపత్రాల జారీ సాగుతోంది. పట్టణంలో ఇద్దరు గుర్తింపు పొందిన నోటరీ న్యాయవాదులు ఉన్నప్పటికీ పార్వతీపురం పట్టణానికి చెందిన నోటరీ న్యాయవాది సంతకాలతో జారీ చేసిన ధ్రువపత్రాలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఎలా ఆమోదిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారాన్ని పట్టణానికి చెందిన ఓ న్యాయవాది కొనసాగిస్తున్నారు.

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ గుర్తింపు పొందిన నోటరీ న్యాయవాదులు పట్టణంలో ఇద్దరు ఉన్నారు. వారు కాకుండా పార్వతీపురం నోటరీ న్యాయవాది సంతకాలతో ధ్రువపత్రాల జారీ సాగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. సాధారణంగా ఒక ప్రాంతానికి చెందిన నోటరీ న్యాయవాది అదే ప్రాంత పరిధిలో ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. సాలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉన్న నోటరీ న్యాయవాదులే ధ్రువపత్రాల జారీ చేయాల్సి ఉంది. అలా కాకుండా 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నోటరీ న్యాయవాది సంతకాలతో ఇక్కడ ధ్రువపత్రాల జారీ చేయడం, అధికారులు వాటిని ఆమోదించడం వివాదాస్పదమవుతోంది. దీనిపై స్థానిక నోటరీ న్యాయవాది ఒకరు ఫిర్యాదు చేసినా జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నోటరీ న్యాయవాదులకు గుర్తింపును జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ జారీ చేస్తుంది. రెవెన్యూ, బ్యాంకు కార్యకలాపాలకు సంబంధించిన ధ్రువపత్రాలకు నోటరీ అవసరం. ఇటీవల దీని అవసరం బాగా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణీత సమయానికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నోటరీ చేయడానికి గుర్తింపు ఇస్తుంది. పట్టణంలో ఇద్దరు నోటరీ న్యాయవాదులు ఉండగా స్థానికేతరుడైన నోటరీ న్యాయవాది సంతకాలతో ధ్రువపత్రాల జారీ ఎలా జరుగుతుందనే విషయంపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

బిజెపి అరాచకాలను తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సాలూరు

దేశంలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న అరాచక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల త్రిపుర రాష్ట్రంలో సిపిఎం కార్యకర్తను పట్టపగలే బిజెపి గూండాలు హత్య చేశారని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకమంది సిపిఎం కార్యకర్తలను హత్య చేశారని తెలిపారు. దేశంలో కులం, మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధానాలను బిజెపి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆందోళన చేపడుతుందని చెప్పారు. ప్రశ్నించే పార్టీ నాయకులను అణిచివేతకు దిగడం అలవాటయిందన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఈ విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, మర్రి శ్రీనివాసరావు, పాచిపెంట మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఈ నెల 13, 14 తేదీల్లో పార్వతీపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దావాల రమణారావు కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో జరగాల్సిన సభలను అనివార్య కారణాల వల్ల 13, 14 తేదీలకు మార్చినట్లు తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అర్థముడి లక్ష్మణరావు, మండల కార్యదర్శి కాద రాము, వై .శ్రీనివాసరావు, చింతల సంజీవి, రైస్ మిల్ కార్మిక ప్రతినిధులు గేదల సత్యం, చల్ల స్వామినాయుడు, కె.సూరయ్య, ఎర్నేన సింహాచలం పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఎంపిపి శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పార్వతీపురం అభియా క్లినిక్ వైద్యులు బి.అనిల్ కుమార్, శశిధర్ వైద్య పరీక్షలు చేశారు. సుమారు 500 మంది వరకు శిబిరానికి హాజరయ్యారు. వారికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఎముకలు, వెన్నెముక, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారికోసం ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు.

వికలాంగులను చిన్నచూపు చూడొద్దు

ప్రజాశక్తి-వేపాడ

వికలాంగులను చిన్న చూపు చూడొద్దని వల్లంపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు శ్రీవల్లి అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వల్లంపూడి భవిత కేంద్రంలో ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులు కూడా పలు అంశాల్లో రాణిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకుని చదవాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్ రావు, ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులు ఎన్.విజయలక్ష్మి, ఎన్.సత్యవతి, సిహెచ్ జయంతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనాలి

ప్రజాశక్తి-గజపతినగరం

రైతులను మోసం చేయకుండా మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి సింహాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఏడాది అలా కాకుండా పగడ్బందీగా కొనుగోలు చేయాలన్నారు. గోను సంచులకు కూడా మిల్లర్లు చుట్టూ తిప్పారని, 10 కేజీల నుండి 20 కేజీల వరకు తూకాల్లో రైతులకు నష్టాలు తెచ్చారని గుర్తు చేశారు. మరో గత్యంతరం లేని పరిస్థితులు తెచ్చిపెట్టి రైతుల్ని దగా చేశారన్నారు. గతం లాగా రైతులను మోసం చేయకుండా సకాలంలో కనీసం మద్దతు ధరతో గోనే సంచులు తగినంత సరఫరా చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సూర్యపీఠంలో హోమాలు చేస్తున్న భక్తులు

సూర్యపీఠంలో గీతా జయంతి వేడుకలు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

భగవద్గీత సాధన సంపదకు గనివంటిదని బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అన్నారు. పట్టణ శివారులో ఉన్న సూర్య పీఠంలో సౌర దీక్షలో భాగంగా ఆదివారం నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో శ్వేత లింగానికి అర్చనలు, ఆదిత్య పంచాయతన విశ్వశాంతి మంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం గీతా జయంతి సందర్భంగా భగవద్గీత శ్లోకాలను పారాయణం చేశారు. కార్యక్రమంలో వివేకానంద, జెఎస్ శర్మ, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులను అలంకరించి నిష్పక్షపాతంగా పనిచేసిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నానాజీ, వెన్నకోట భాస్కర్ శర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి కెడిఆర్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కింతలి దామోదరరావు అనారోగ్యంతో ఆదివారం తన నివాసంలో మరణించారు. గత కొన్ని రోజులుగా కెడిఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించారు. కెడిఆర్‌కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మురళి చిట్స్ వ్యాపారం చేయగా మిగిలిన కుమారులు శ్రీనివాసరావు, బంగారురాజు, శివ వ్యాపారం చేస్తున్నారు. కుమార్తె ప్రసన్న అమెరికాలో ఉంటున్నారు. రెండో కోడలు గీత బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గాను, మూడో కోడలు శ్రీదేవి టిడిపి కౌన్సిలర్‌గా పని చేస్తున్నారు. కెడిఆర్ మృతికి పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బాడంగి

రామభద్రపురం మండలం మిర్తివలస గ్రామానికి చెందిన పాచిపెంట శ్రీనివాస్‌రావు(42) బాడంగి మండలంలో బొత్సవానివలసలో పురుగులు మందు తాగి మృతి చెందాడు. ఆ గ్రామంలో రెండేళ్ల క్రితం కోళ్ల ఫారం లీజుకు తీసికొని భార్య, కొడుకుతో అక్కడే ఉంటున్నారు. మద్యానికి బానిసైన అతన్ని తాగొద్దని భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే స్థానిక పిహెచ్‌సికి అక్కడి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఈ ఏడాది రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 17 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యపు సంచులు పంపిణీ చేపట్టామని తెలిపారు. కొన్నిచోట్ల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కళ్లాల దగ్గర నుంచే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లుల కేటాయింపు జరిగితే అన్ని గ్రామాల్లోనూ రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఎంపిటిసి బడే రామారావు, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్ పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ అకిబ్ జావేద్, పాల్గొన్నారు.

పాలకొండ : ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని విధాలా ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ధాన్యం సేకరణ వాహనాలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రైతులకు కచ్చితంగా మద్దతు ధర అందించడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం రైతు భరోసా కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి అక్కడి అధికారుల సమక్షంలో అమ్మకాలు చేయాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు.

పాలకొండ.. ధాన్యం సేకరణ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

నైపుణ్యం ఉన్న వారికే డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మారుతున్న ఆర్థిక, సామాజిక, భౌగోళిక పరిస్థితులను బట్టి భవిష్యత్తులో జీవనోపాధికి తమతమ విషయ జ్ఞానంతో పాటు నైపుణ్యం కూడా ఎంతో అవసరమని గిరిజన యూనివర్శిటీ విసి కట్టమని అన్నారు. అటువంటి నైపుణ్య కల్పనకు కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయం ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని అన్నారు. సిటియు విద్యార్థులే కాకుండా ఇతర నిరుద్యోగ యువత సద్వినియోగం చేసికొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఆదివారం ఆయన చేతుల మీదుగా యూనివర్శిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నేషనల్ అకాడమీ అఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జాతీయ జలజీవన్ మిషన్ సహకారంతో నిర్వహించ తలపెట్టిన ప్లంబింగ్, మాసనరీ బ్రాంచిల్లో సుమారు 60మందికి స్కిల్ అప్ గ్రేడేషన్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను నిరంతరం పదును పెట్టుకోవాలన్నారు. అటువంటి వారికే మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ అకాడమీ అఫ్ కన్‌స్ట్రక్షన్ అడిషనల్ డైరెక్టర్ జి.చిట్టిబాబు, సెంటర్ ఇన్‌ఛార్జిలు ఎం.సుధాకర్, కె.నాగేశ్వర రావు, ఎం.కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి అశోక్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యా రంగానికి నష్టం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి విద్యా రంగాన్ని కాపాడుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ అన్నారు. విద్యా రంగ, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయడంతో పాటు సామాజిక సేవలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు ముందుంటారని చెప్పారు. గంటి ప్రసాదం భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా 30వ మహాసభలో రెండోరోజు ప్రతినిధులను ఉద్దేశించి అశోక్ మాట్లాడారు. కోవిడ్ సమయంలో కోవిడ్ బాధితులకు మందులు, భోజనాలు, నిత్యావసర సరుకులను అందించిన ఘనత ఎస్ఎఫ్ఐకు దక్కుతుందన్నారు. రక్తదానాలు చేసి గర్భిణులను, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆదుకొని ప్రాణదాతలు అవుతున్నారన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చేపట్టిన బస్సు యాత్రను శ్రీకాకుళంలో పోలీసులతో అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, నిర్బంధాలను ఎదిరించి విజయనగరంలో బహిరంగ నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో విద్యా రంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, శాస్త్రీయ విద్యా కోసం పోరాడాలని కోరారు. బాలికలపై దాడులను నివారించాలని డిమాండ్ చేశారు. ఖాళీ ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఎస్ఎఫ్ఐ, విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని కోరారు. మాజీ అధ్యక్షులు కె.ఆనంద్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరుగిపోతుందని, నోటిఫికేషన్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో గత కార్యక్రమాలను చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించారు.

మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి

దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. మహాసభలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద దాడులు పెరిగిపోయాయని అన్నారు. భగత్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని తిప్పి కొట్టేందుకు ఐక్యంగా పోరాడాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

29మందితో ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డి.రాము, వి. చినబాబు, సతీష్ దేవ్ సింగ్, సిహెచ్ రామకృష్ణ, జె.రవి కుమార్, ఎం. హర్ష, ఎం. సౌమ్య, బి. లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు

ఎమ్మెల్యే జోగారావు


ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఆదివారం మండలంలోని తామరకండి గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల హామీలన్నీ తూచ తప్పకుండా అమలు చేస్తున్న సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, బి.శ్రీరాములునాయుడు, ఎంపిటిసి సభ్యులు ఎగిరెడ్డి గౌరీశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ మూడడ్ల లలిత, నాయకులు ఎంమన్మథరావు, ఎం.స్వామి నాయుడు, ఎం.శంకర్రావు, అంబటి కృష్ణంనాయుడు, ఆర్‌వి, రత్నాకర్, తెంటు వెంకట అప్పలనాయుడు, ఎన్.రామకృష్ణ, పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పరామర్శ

చినబోగిలి సర్పంచ్ కూర్మాన రాధ భర్త, వైసిపి సీనియర్ నాయకులు కూర్మాన శ్రీనివాసరావు అనారోగ్య సమస్యతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే జోగారావు ఆయన్ను పరామర్శించారు.

వంతెన పనులు చేపట్టకుంటే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కొమరాడ

దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు- లాబేసు వంతెన పనులు ప్రారంభించకుంటే నిరాహార దీక్ష చేస్తామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. ఆదివారం పూర్ణపాడు- లాబేసు వంతెన వద్ద సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ 14 ఏళ్లగా వంతెన పూర్తిచేయకుండా కాలయాపన చేస్తున్నారని పాలకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గిరిజనుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఇటీవల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిని అందిస్తే, జూన్ 2023 కల్లా వంతెన పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఇ కృష్ణాజిని ఆదేశించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో పనులు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు యమక గౌరునాయుడు, వ్యకాస నాయకులు ఆర్.శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు తవిటయ్య, గిరిజనులు పి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి, గిరిజనులు

అలరించిన ఘంటసాల స్వరార్చన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఘంటసాల శతజయంతి సందర్భంగా శ్రీకోటదుర్గ కళాకారుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల పోటీలు ఆద్యంతం అలరించాయి. స్థానిక కోటదుర్గమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కళాకారులు ఘంటసాల గీతాలను ఆలపించి, ఆకట్టుకున్నారు. ఘంటసాల సంగీత విభావరి, నాటక ప్రదర్శన కూడా ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత భాస్కరనాయుడు, నిర్వాహకులు కొబగాన సూరన్నాయుడు, యోగా గురువు జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : పట్టణంలోని చర్చి సెంటర్ వద్దనున్న కమ్యూనిటీ హాల్‌లో వ్యవస్థాపకులు డి.జమ్మరాజు ఆధ్వర్యంలో ఘంటసాల శతజయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంచిపల్లి శ్రీరాములు మాస్టారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కలెక్టరేట్.. జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంచిపల్లి శ్రీరాములు

అనంతరం ఘంటసాల పాడిన పాటలు, భక్తి గీతాలు, సుమధుర గేయాలను గాయకులు ఆలపించారు. కార్యక్రమానికి రచయిత గంటేడ గౌరునాయుడు , డి.శాంతిరాజు, వై.త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట.. ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట : పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు ఆధ్వర్యంలో ఘంటసాల జయంతిని నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి వాలంటీర్ కన్వీనర్ పెనుబోతు భాస్కరరావు, మరడాన పార్వతమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చుక్క అప్పలనాయుడు, మత్స సత్యంనాయుడు, టైగర్ దుర్గా ప్రసాద్, మత్స శ్రీను, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రాములమ్మ

అర్హులంతా ఓటరుగా చేరాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటును నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. ఆదివారం మండలంలోని మొరమగూడ, కొండవాడ, పిటిజి గ్రామాలలో గిరిజన యువతి యువకులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమని తెలిపారు. అర్హులంతా ఓటరుగా చేరాలని కోరారు. అనంతరం ఆమె ఆయా గ్రామాలలో ఉన్న 73, 74, 75, 76 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో బిఎల్ఒలు పాల్గొన్నారు.

వీరఘట్టం : 18 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ జె.మాధవి కోరారు. మండలంలోని తూడి, రేగులపాడు, కత్తులకవిటి, నడుకూరు తదితర గ్రామాల్లో పర్యటించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం పోలింగ్ స్టేషన్లను పరిశీలించి బిఎల్ఒలకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ జి.ప్రసాదరావు ఉన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదబొండపల్లి, వెంకంపేట, తాళ్లబురిడి, జమదాల గ్రామాల్లో తహశీల్దార్ శివన్నారాయణ పర్యటించి, ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు.

భారత నావికాదళ దినోత్సవ వేడుకలు

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు అధ్యక్షతన భారత నావికాదళ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భారత నావికాదళ గొప్పతనాన్ని, 1971లో పాకిస్తాన్‌పై విజయాలు గుర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం 13 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన హవల్దార్ సురేంద్ర ప్రసాద్, రవీంద్ర రాథోరి, కళాశాల ఎన్‌సిసి కేర్ టేకర్ భాస్కర్, కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడేట్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దండికి మాతృ వియోగం

ప్రజాశక్తి-సాలూరు

వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు మాతృమూర్తి దండి సింహాచలమమ్మ (60) ఆదివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. మండలంలో బూతాడ కర్రివలస గ్రామంలో ఇంటి వద్దనే ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల నాయకులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దింటి మాధవరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

సందీప్ (ఫైల్)

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని బద్నాయికువలస బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గెమ్మిల సందీప్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. సందీప్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 29న పాచిపెంట పిహెచ్‌సిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. 30న సాలూరు సిహెచ్‌సికు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈ నెల ఒకటో తేదీన విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థి స్వగ్రామం మండలంలోని కంకణాపల్లి గ్రామం. విద్యార్థి దహన కార్యక్రమం నిమిత్తం తక్షణ సహాయం కింద పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యుఒ పరమేష్.. తల్లిదండ్రులకు రూ.20 వేల చెక్కును అందజేశారు.

పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పాలకొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తెలుగు అకాడమీ పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. నిరుద్యోగులు పుస్తకాలను గ్రంథాలయంలో చదువుకోవాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు కోరారు.

మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. యువతి యువకులు హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా గడిపారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు. విలువిద్య, గన్‌షాట్ షూటింగ్ చేశారు. చిన్నారులు కమాండర్నెట్ ఎక్కి ఉత్సాహంగా గడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకులు జలకాలాడారు.

హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్తున్న యువతులు